ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక

**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 1 | పేజీలు: 5 | వెల: రూ.3/- | సోమవారం 14 ఏప్రిల్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# ‘30 రోజుల్లో స్వతాహగా దేశం విడిచి వెళ్లిపోండి’

వారికి అమెరికా వార్నింగ్
అవసరమైతే ఫ్లైట్ టికెట్లపై రాయితీ ఇస్తామని వెల్లడి
అక్రమ నివాసితులకు అమెరికా మరోసారి హెచ్చరిక



హైదరాబాద్, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం): అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న వారు తక్షణమే స్వతహాగా దేశం విడిచిపెట్టి వెళ్లాలని ఆ దేశం మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. విమాన టికెట్ సొమ్మును భరించలేకపోతే రాయితీ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపింది. అమెరికాలో 30 రోజులకు మించి ఎక్కువకాలం నివసిస్తున్న విదేశీయులు తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద రిజిస్టర్ చేసుకోవాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ హెచ్చరికలు జారీ చేసింది. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే నేరం కింద పరిగణించి అపరాధ రుసుం, జైలు శిక్షలు విధిస్తారు. అందుకే అక్రమంగా అమెరికాలో నివసిస్తున్న వారు స్వతహాగా దేశం విడిచిపెట్టాలని డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ ఎక్స్‌లో సందేశం ఉంచింది.


**5000 డాలర్ల వరకు ఫైన్**

సొంతంగా అమెరికాను వీడటమే ఉత్తమమైన మార్గమని తెలిపింది. సామాను సర్దుకొని విమానం ఎక్కాలని, ఎటువంటి నేర నేపథ్యం లేకపోతే అమెరికాలో సంపాదించుకొన్న సొమ్మును దాచుకొని బయల్దేరాలని హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ వెల్లడించింది. ఇలాంటి వారు విమాన టికెట్ సొమ్మును భరించలేకపోతే రాయితీ ఇచ్చేందుకు అమెరికా ఏర్పాట్లు చేసింది. ఈ నిబంధనలు పాటించకపోతే తక్షణమే దేశం నుంచి పంపిచేస్తామని అమెరికా పేర్కొంది. అంతేకాకుండా ఫైనల్ ఆర్డర్ అందుకొన్న వారు ఒక్క రోజు అధికంగా ఉంటే రోజుకు 998 డాలర్లు జరిమానా, సొంతంగా వెళ్లిపోకపోతే 1,000 నుంచి 5000 డాలర్ల ఫైన్ విధించనున్నారు. జైలు శిక్షను కూడా విధించే అవకాశం ఉందని. వారికి భవిష్యత్తులో చట్టపరమైన మార్గంలో కూడా అమెరికాలోకి ప్రవేశం లభించదని చెప్పింది.

**వారిపై ఈ ప్రభావం పడదట**

ఈ నిర్ణయం నేరుగా హెచ్1బీ, విద్యార్థి పర్మిట్లపై ఉండేవారికి వర్తించదు. కానీ, సరైన అనుమతులు లేకుండా అమెరికాలో ఉండిపోయే వారిపై మాత్రం దీనిని కచ్చితంగా అమలు చేయనున్నారు. ఎవరైనా హెచ్1బీ వీసాపై వచ్చి ఉద్యోగం కోల్పోతే వారు నిర్ణీత సమయం దాటి అమెరికాలో ఉంటే మాత్రం చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. విద్యార్థి, హెచ్1బీ వీసాదారులు అమెరికా చట్టాలు సూచించిన అన్ని నిబంధనలు కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది.

# భూభారతి కనీసం 100 ఏళ్ల పాటు ఉంటుంది



## సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం): తెలంగాణ రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా మూడు మండలాల్లో అమలుచేయనున్న భూభారతి పోర్టల్‌పై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మేరకు భూభారతి పోర్టల్ సోమవారం జాతికి అంకితమివ్వనున్నట్లు తెలిపారు. సామాన్య రైతుకు కూడా అర్థమయ్యేలా భూభారతి పోర్టల్ ఉండాలని సీఎం అధికారులను ఆదేశించారు. భూభారతి కనీసం 100 ఏళ్ల పాటు ఉంటుందని ఆకాంక్షించారు.

అత్యాధునికంగా భూభారతి : అత్యాధునికంగా భూభారతి వెబ్‌సైట్ ఉండాలని, భద్రతాపరమైన సమస్యలు రాకుండా పకడ్బందీగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భూభారతి నిర్వహణను మంచి విశ్వసనీయత కల్గిన సంస్థకు అప్పగించాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, సీసీఎల్ఏ ప్రధాన కమిషనర్ నవీన్ మిత్తల్, సీఎం ఓఎస్డీ, రెవెన్యూశాఖ కార్యదర్శి జ్యోతి బుద్ధప్రకాశ్ పాల్గొన్నారు.

ఎన్నికలకు భూభారతి రెఫరెండం : సోమవారం రోజున ముందుగా 3 మండలాల్లో పైలట్‌గా భూభారతి అమలు కానుందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా భూభారతి అమలవుతుందని పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికలకు భూభారతి రిఫరెండం అవుతుందని అన్నారు. మే నెల మొదటివారంలో గ్రామపరిపాలనాధికారుల నియామకం ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.



## బాణసంచా తయారీ కేంద్రంలో
# పేలుడు

### 8కి చేరిన మృతుల సంఖ్య

అనకాపల్లి అగ్నిప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి
హోంమంత్రి అనిత, కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడిన సీఎం చంద్రబాబు
మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల పరిహారం

అనకాపల్లి ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం): అనకాపల్లి జిల్లాలోని బాణసంచా తయారీ కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు. మరో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కోటవుట్ల మండలం కైలాస పట్టణంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఈరోజు మధ్యాహ్నం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం మృతులు, గాయపడిన వారు ఎక్కువ మంది ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సామర్లకోటకు చెందిన వారుగా చెప్తున్నారు. తారాజువ్వలు తయారీలో పేరొందిన బాణాసంచా కర్మాగారం కావడం, పెళ్లిళ్లలో సీజన్ కావడంతో బాణాసంచా తయారు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం సంభవించింది. పేలుడు ధాటికి భారీగా శబ్దం వచ్చింది. ప్రమాదంలో ..మిగతా 2లో

# పలు జిల్లాల్లో వడగళ్ల వాన

ఆ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం
రాష్ట్రంలోని పలుచోట్ల ఈదురుగాలులు, వడగళ్ల వాన
అకాల వర్షం నిండా ముంచిందని రైతుల ఆవేదన
జనగామ వ్యవసాయ మార్కెట్ యార్డులో నీటిలో కొట్టుకుపోయిన ధాన్యం



హైదరాబాద్, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం): రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షం బీభత్సం సృష్టించింది. జనగామ జిల్లాలో పలు గ్రామాల్లో ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షం కురిసింది. జనగామ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్షపు నీటికి ధాన్యం కొట్టుకుపోయింది. జనగామ, లింగాల గణపురం, రఘునాథపల్లి మండలాల్లో వర్షం పలుచోట్ల వర్షానికి పంట నేలరాలింది. అకాల వర్షం తమను నిండా ముంచిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

అకస్మాత్తుగా వచ్చిన వర్షం : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం అక్కన్నపేట, భీమదేవరపల్లి మండలాల్లోని పలు గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం, మొక్కజొన్న పంటలు తడిసిపోయాయి. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై అకస్మాత్తుగా వర్షం కురవడంతో కల్లాల్లో ఆరబోసుకున్న ..మిగతా 2లో



## అధికారుల ముందు
# రాణా కోరికల చిట్టా

ముంబయి, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం): ముంబయి ఉగ్రదాడుల కుట్రదారుడైన తహవూర్ హుస్సేన్ రాణా.. జాతీయ దర్యాప్తు సంస్థ కస్టడీలో ఉన్నాడు. 24 గంటల నిఘా నీడలో ఉన్న రాణా.. తనకు కొన్ని వస్తువులు కావాలని అధికారులను కోరాడు. ముఖ్యంగా ఖురాన్ , పెన్ను, పేపర్ వంటి ఇవ్వాలని అధికారులను అభ్యర్థించాడు. అతడికి అవసరమైన సమాచారాన్ని సేకరించడానికి ఇవి ఉపయోగపడతాయని చెప్పినప్పటికీ.., ఖురాన్ ని నమాజ్ కోసం ఉపయోగించాడని అధికారులు తెలిపారు. అవరసమైన వస్తువులను అతడికి అందించనప్పటికీ రాణా ప్రతీ చర్యను సునిశితంగా గమనిస్తున్నారు. అతడు రోజుకు ఐదుసార్లు నమాజ్ చేస్తున్నట్టు అధికారులు తెలిపారు.కాగా, ముంబయి దాడుల ప్రధాన నిందితుడు డేవిడ్ కోల్మన్ హెడ్లీ అలియాస్ దావూద్ గిలానీతో పెద్ద సంఖ్యలో జరిగిన ఫోన్ కాల్స్ డేటా సహా దర్యాప్తు సంస్థ ..మిగతా 2లో

# రణరంగమైన బెంగాల్

అల్లర్లలో ముగ్గురు మృతి, 150 మంది అరెస్ట్



ముర్షిదాబాద్, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం): పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ రణరంగమైంది. ముర్షిదాబాద్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో వక్ఫ్ అమెండ్‌మెంట్ యాక్ట్‌ను వ్యతిరేకిస్తూ ముస్లిం ఆందోళనకారులు చేపట్టిన నిరసన హింసకు దారితీసింది.

ఈ విధ్వంసకాండలో ఇప్పటివరకు ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. దాంతో పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పశ్చిమ బెంగాల్ పోలీసులు అల్లర్ల కేసులో 150 మందిని అరెస్ట్ చేశారు.

పార్లమెంట్‌లో వక్ఫ్ అమెండ్‌మెంట్ బిల్లు ఆమోదం పొందినప్పటి నుండే ముర్షిదాబాద్ జిల్లాలో ఆ బిల్లును వ్యతిరేకిస్తూ ఆందోళనలు జరుగుతున్నాయి. ఆ బిల్లు రాష్ట్రపతి ఆమోదం పొంది, చట్టరూపం దాల్చడంతో ఆ ఆందోళనలు కాస్త అల్లర్లకు దారితీశాయి. సూతి, ధులియన్, శంషేర్ గంజ్, జంగీపూర్ ప్రాంతాల్లో అల్లర్ల ప్రభావం ఎక్కువగా కనిపించింది. అల్లర్లు జరిగిన ప్రాంతాల్లో పరిస్థితి చేయిదాటి పోకుండా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు కర్ఫ్యూ విధించారు. కేంద్రంపై విమర్శలు ఎక్కుపెట్టిన మమతా బెనర్జి పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జి ఈ అల్లర్లపై స్పందించారు. అల్లర్ల వెనుకున్న వారే ఈ హింసకు పాల్పడుతున్నారని మమత ఆరోపించారు. ఈ వివాదాస్పద చట్టాన్ని తీసుకొచ్చింది కేంద్రమే కానీ రాష్ట్ర ప్రభుత్వం కాదని అభిప్రాయపడ్డారు. తమ ..మిగతా 2లో



## బీజేపీ ఆధ్వర్యంలో అంబేద్కర్‌కు
# ఘన నివాళులు

గద్వాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం)భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం కేటిదొడ్డి మండలం గువ్వలదిన్నె గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ముందు బీజేపీ మండలాధ్యక్షుడు శ్రీపాదరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కొవ్వతులు వెలగించి నివాళులర్పించారు. జై భీమ్ నినాదాలతో మార్మోగింది. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని మండలాధ్యక్షుడు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి మాట్లాడుతూ...

బీజేపీ రాష్ట్ర అదిష్టానం ఆదేశాల మేరకు, జాతీయ ఉపాధ్యక్షురాలు, పాలమూరు ఎంపీ డీకె అరుణ సూచన మేరకు గావ్ చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా గువ్వల దీన్నె గ్రామంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి జయంతి నిర్వహించడం జరిగిందన్నారు. ముందస్తు కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్ విగ్రహన్ని శుద్ధి చేసి కొవ్వొత్తు లను వెలిగించి జై భీమ్ నినాదాలతో కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు ఈరన్న, కార్యదర్శి మాషప్ప, మాజీ ఎంపిటిసి రంగప్ప, ఎంఆర్పిఎస్ నాయకులు మల్లేష్, హన్మంతు , నరసింహులు, జంబయ్య, తిర్మలి , గురు, స్వామి ,చిన రంగప్ప తదితరులు పాల్గొన్నారు



## బాణసంచా తయారీ కేంద్రంలో
# పేలుడు

మొదటి పేజీ తరువాయి...

గాయపడిన వారిని చికిత్స నిమిత్తం నర్సీపట్నం ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు, అధికారులు చేరుకొని సహాయ చర్యలు చేపట్టారు.

మృతుల వివరాలు ఇవీ : కైలాసపట్నం గ్రామానికి చెందిన ఎ. తాతబాబు(45), యాది గోవింద్(45), రాజపేటకు చెందిన దాడి రామలక్ష్మి(38), సామర్లకోటకు చెందిన నిర్మల (38), పురం పాప(40), వేణుబాబు (40), చౌడువాడకు చెందిన సేనాపతి బాబురావు, విశాఖకు చెందిన మనోహర్(30) ఉన్నారు. వీరంతా బాణాసంచా తయారీ కేంద్రంలో కూలి పనికి వచ్చినట్లు తెలుస్తోంది.

సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి : బాణసంచా పరిశ్రమలో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హోంమంత్రి అనిత, కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదంపై ఆరా తీశారు. బాధితుల ప్రస్తుత పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రుల పరిస్థితిని సీఎం చంద్రబాబుకు అధికారులు వివరించారు. ప్రమాదంలో ఆరుగురు మరణించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు. గాయాలైన ఆరుగురిలో ఇద్దరి పరిస్థిత విషమంగా ఉన్నట్లు వివరించారు. అలాగే గాయాలైన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు.

## అధికారుల ముందు
# రాణా కోరికల చిట్టా

మొదటి పేజీ తరువాయి...

సేకరించిన వివిధ సాక్ష్యాల ఆధారంగా ఈ విచారణ కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. తహవూర్ రాణాకు పాకిస్థాన్ గూఢచారి సంస్థ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ అధికారులతో అనుమానాస్పద సంబంధాలు, దాడులకు పాల్పడిన ఉగ్రవాద సంస్థ లష్కరే తొయిబాతో అతడి అనుబంధంపై ప్రశ్నిస్తున్నారు. ముంబయిలో పనిచేయని ఇమ్మిగ్రేషన్ కార్యాలయాన్ని నిర్వహించడానికి నిధులను ఎలా సమకూర్చాడనే దానిపై ఎన్ఐఏ విచారణ జరుపుతుంది. 2006,-2009 మధ్య డేవిడ్ కోల్మన్ హెడ్లీ నిఘా కార్యకలాపాలకు ఇది ఓ కేంద్రంగా ఉంది. పాకిస్థాన్ హ్యాండ్లర్లతో అతడి సమావేశాలు, మెయిల్ సంభాషణల గురించి కూడా %చీ×ూ% అతడ్ని విచారిస్తోంది. 2005లో డేవిడ్ హెడ్లీని భారత్లో గూఢచర్యం నిర్వహించమని లష్కరే తొయిబా ఆదేశించినప్పటి నుంచి జరిగిన కుట్రను ఈ విచారణలో భాగంగా పరిశీలిస్తున్నారు. ముంబయి ఉగ్రదాడులు ప్రణాళికల గురించి తెలిసిన దుబాయ్లోని రహస్య సాక్షి సహా అతడు కలిసిన ఇతర వ్యక్తుల గురించి కూడా రాణాను ప్రశ్నించే అవకాశాలు కనపడుతున్నాయి. దేశ ఆర్థిక రాజధానిలో దాడులకు కొన్ని రోజుల ముందు ఉత్తర, దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాలలో రాణా ప్రయాణాలు కీలక ఆధారాలు అందజేస్తాయని అధికారులు ఆశిస్తున్నారు.' తహవూర్ రాణా 18 రోజుల పాటు కస్టడీలో ఉంటాడు. ఆ దాడుల్లో మొత్తం 166 మంది మరణించారు.. 238 మందికి పైగా గాయపడ్డారు' అని శుక్రవారం తెల్లవారుజామున కోర్టు తీర్పు వెలువరించిన వెంటనే దర్యాప్తు సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.

# రణరంగమైన బెంగాల్

మొదటి పేజీ తరువాయి...

తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఈ వివాదాస్పద చట్టానికి మద్దతు ఇవ్వడం లేదని అన్నారు. చూస్తూ ఊరుకోలేం - పశ్చిమ బెంగాల్ హై కోర్టు పశ్చిమ బెంగాల్ లో అల్లర్లపై ఆ రాష్ట్ర హై కోర్టు మండిపడింది. పరిస్థితి మరీ భయంకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేసిన హై కోర్టు, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుంటే మూగ సాక్షిలా చూస్తూ ఊరుకోలేం అని వ్యాఖ్యానించింది. శాంతి భద్రతలను అదుపులోకి తీసుకొచ్చేందుకు వెంటనే కేంద్ర బలగాలను రంగంలోకి దింపాల్సిందిగా పశ్చిమ బెంగాల్ హై కోర్టు ఆదేశించింది. హై కోర్టు ఆదేశాలతో ప్రభుత్వం ముర్షిదాబాద్ జిల్లాలో శనివారం నాలుగు సెంట్రల్ ఫోర్సెస్ బలగాలను మోహరించింది. ఆదివారం మరో 5 బీఎస్ఎఫ్ బలగాలు రంగంలోకి దిగాయి.

## గులాబీ పండుగకు
# గద్వాల జిల్లా నుంచి కదం తొక్కాలి

**బీఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల పండుగ సందర్భంగా యువజన విభాగం సమావేశానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ డా.ఆంజనేయులు గౌడ్..**

**గద్వాల నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు గారు**



ఏప్రిల్ 27న వరంగల్ లో జరిగే గులాబీ పండుగకు గద్వాల గడ్డ నుంచి తెలంగాణ అభిమానులు, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం నాయకులు భారీ సంఖ్యలో కదం తొక్కాలని డా.ఆంజనేయులు గౌడ్,బాసు హనుమంతు నాయుడు పిలుపునిచ్చారు.ఆదివారం గద్వాల జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ 25 ఏండ్ల పండుగ సందర్భంగా యువజన విభాగం సమావేశం ఏర్పాటు చేశారు... ఈ సమావేశానికి నియోజకవర్గ ఇన్చార్జ్ బాసు హనుమంతు నాయుడు గారితో కలిసి, ఆంజనేయులు గౌడ్ పాల్గొన్నారు... అంతక ముందు,పార్టీ కార్యాలయ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వరంగల్ సభకు బయలుదేరే ముందు ఆయా వార్డులు,గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ జెండాలను ఆవిష్కరించుకుని బస్సుల్లో బయలుదేరాలని సూచించారు. ఈ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కానీ హామీలు ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్త పైన ఉందని వారన్నారు...సభ విజయవంతం చేయడంలో మిగతా అన్ని నియోజకవర్గాల కంటే గద్వాల నియోజకవర్గం ముందుండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయ చైర్మన్ పటేల్ విష్ణువర్ధన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగర్ దొడ్డి వెంకట రాములు,చక్రధర్ రావు,ఆ.ర్.కిషోర్,డి.శేఖర్ నాయుడు,రవి ప్రకాష్ గౌడ్,అంగడి బస్వరాజు,కురవ పల్లయ్య,రామకృష్ణ ముదిరాజు,మాల మల్లికార్జున్,శ్రీ రాములు,సత్యం,తిరుమలేష్,కృష్ణ రెడ్డి, వెంకట్,ముని మౌర్య, కృష్ణ, అనిల్,మాల ముని స్వామి,తిమ్మప్ప, సురేందర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు,యూత్ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 8 మంది ఐఏఎస్
# అధికారులు బదిలీ




**హైదరాబాద్, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం):** ఏపీలో పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. 8 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు ఇచ్చారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా బదిలీ అయ్యారు. సిసోడియాను చేనేత జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సీసీఎల్ఏగా ఉన్న జయలక్ష్మికి రెవిన్యూ శాఖ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐటీ సెక్రటరీగా ఉన్న కాటమనేని భాస్కర్‌కు ఏపీ మానవ వనరుల అభివృధి సంస్థ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టారు. పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న రేవు ముత్యాలరాజును పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. రైతు బజార్ల సీఈఓగా కే.మాధవీలతకు పోస్టింగ్ ఇచ్చారు. ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ సొసైటీ కార్యదర్శిగా గౌతమి బదిలీ అయ్యారు. ఆయుష్ డైరెక్టర్‌గా దినేష్ కుమార్ నియామించారు. వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖలోని ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ డైరెక్టర్‌గా నీలకంఠారెడ్డిని నియమించారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులు జారీ చేశారు.

# పలు జిల్లాల్లో వడగళ్ల వాన

మొదటి పేజీ తరువాయి...

వరి ధాన్యం, మొక్కజొన్న పంటలకు టార్పాలిన్ కవర్లు కప్పుకునే సమయం రైతులకు లేకుండా పోయింది. అరుగాలం పండించిన పంట అకాల వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ఆందోళన చెందుతున్నారు.

రైతుల ఆవేదన : ఉమ్మడి నల్గొండ జిల్లాలో తిరుమలగిరి, నాగారం మండలాల్లో వర్షం పడుతోంది. పలు గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వాన కురుస్తోంది. యాదాద్రి జిల్లా అడ్డగూడూర్ మండలం చిర్రగూడూరు, శాలిగౌరారంలో వడగళ్ల వాన పడుతోంది. హనుమకొండ జిల్లాలోని భీమదేవరపల్లి మండలం పలు గ్రామాల్లో కురిసిన వర్షానికి ధాన్యం, మొక్కజొన్న తడిసింది. అకాల వర్షానికి రైతులు తీవ్రంగా నష్టం చేకురిందని వాపోతున్నారు.

పలు మండలాల్లో విద్యుత్ అంతరాయం : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోఉరుములు మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడుతోంది. పలు మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.



రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో సమావేశమైన బీజేపీ నాయకులు

# డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను గౌరవించిన పార్టీ బీజేపీ

## పంతంగి రాజూపాల్ గౌడ్

బుద్వేల్, ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను గౌరమిచిన పార్టీ బీజేపీ పార్టీ అని ఆ పార్టీ రంగారెడ్డి రూరల్ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజూపాల్ గౌడ్ అన్నారు. కేంద్ర పార్టీ ఇచ్చిన పిలుపుమేరకు ఆదివారం బుద్వేల్ బాబు జగ్జీవన్ రాం విగ్రహాన్ని శుద్ధి చేసిన బీజేపీ నాయకులు అక్కడి నుంచి ర్యాలీగా రాజేంద్రనగర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి అంబేద్కర్ విగ్రహాన్ని సైతం శుద్ధి చేశారు. ఈ సందర్భం గా పంతంగి రాజభూపాల్ గౌడ్ మాట్లాడుతూ. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ను కాంగ్రెస్ పార్టీ ఎన్నో సార్లు అవమానపరిచిందన్నారు. అంబేద్కర్ లోక్ సభ కు పోటీ చేసిన సమయంలో ఆయనను ఓడించిన పార్టీ కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. అదే సమయంలో అంబేద్కర్ ను అన్ని విదాలుగా గౌరవించిన పార్టీ బీజేపీ ఒక్కటే అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, చేవెళ్ల పార్లమెంటు కన్వీనర్ ఎన్.మల్లారెడ్డి, రాజేంద్రనగర్ నియోజకవర్గం కన్వీనర్ పి.మల్లేశ్ యాదవ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరని పదానంద్, ఎస్సీ మోర్చా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ జోగి రవి. రం గారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి కోరని క్రాంతి, సీనియర్ నాయకుల వేముల మల్లేశ్, కె. హరికిషన్ జీ, షాబాద విజయ్ కుమార్ , పి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్

# నేడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు

బుద్వేల్, ఏప్రిల్13(ప్రభాత ఉదయం) : ఈ నెల 14న ఉదయం 9 గంటల కు రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు జయంతి ఉత్సవాల కమిటీ నిర్వాహకులు తెలిపారు. రాజేంద్రనగర్ సర్కిల్ లో మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ ఆద్వర్యంలో పెద్ద ఎత్తున నిర్వహించనున్న అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, శాసనమండలి మాజీ చైర్మన్ కె.స్వామీగౌడ్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద క్రిష్ణ మాదిగ, ముదిరాజ్ కార్పోరేషన్ చైర్మన్ బి.జ్ఞానేశ్వర్ ముదిరాజ్. వివిధ పార్టీల నాయకులు పి.కార్తీకరెడ్డి, వై.శ్రీదర్, కార్పొరేటర్లు పి.అర్చన జయప్రకాశ్, మోంద్ర సంగీత గౌరీశంకర్, తోకల శ్రీనివాస్ రెడ్డి మాజీ కార్పొరేటర్ టి.ప్రేందాస్ గౌడ్తో పాటు అన్ని పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు పాల్గొం టారన్నారు. కళాజాత బృందంతో పాటలు ఉంటాయన్నారు.

## భూమి రిజిస్ట్రేషన్‌కు
# సర్వే మ్యాప్ తప్పనిసరి

**హైదరాబాద్, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం):** వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భూభారతిని రెఫరెండంగా భావిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. భూ భారతితో భూ వివాదాల్లేని తెలంగాణ చూస్తామన్న నమ్మకాన్ని వ్యక్తంచేశారు. ఈ మేరకు సోమవారం బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకురావడంతోపాటు పోర్టల్‌ను ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సచివాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించిన మంత్రి పొంగులేటి భూభారతికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. తొలుత మూడు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలుచేయబోతున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి పరిష్కరించిన తర్వాత జూన్ 2 నాటికి రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయనున్నట్టు తెలిపారు. ఇక భూ రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తామని, ఇందుకోసం కొత్తగా 6 వేల మంది ప్రైవేటు సర్వేయర్లను నియమించి శిక్షణ ఇస్తామని చెప్పారు. సర్వేకు సంబంధించిన చార్జీలు రైతులే భరించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఇక భూ సమస్యల పరిష్కార బాధ్యతను తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్లకు అప్పగిస్తామని, అవసరమైతే ట్రిబ్యునల్స్ కూడా ఏర్పాటుచేస్తామని తెలిపారు. భూ రికార్డులను పరిరక్షించడం, వాటిపై రిపోర్ట్ ఇచ్చే బాధ్యతను మాత్రమే గ్రామ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. రికార్డుల్లో మార్పులు చేర్పులపై వీరికి అధికారం ఉండబోదని స్పష్టంచేశారు. రికార్డులను రాయగలిగేవారినే జీపీవోలుగా నియమిస్తామని, ధరణిలో అక్రమాలపై ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహిస్తామని తెలిపారు. మనుషులకు ఆధార్ మాదిరిగా భూమికి భూదార్‌ను తీసుకొస్తామన్నారు. భూభారతి అమల్లోకి వచ్చినందున తక్షణమే కొత్త పాస్ పుస్తకాల అవసరం ఉండదని చెప్పారు. ఎన్ఐసీ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్లకు ఆటంకం కలగకుండా భూభారతిని అమలుచేస్తామని స్పష్టంచేశారు.







# సనాతన ధర్మానికి ఆలయాలు కేంద్ర బిందువులు

## శ్రీ వెంకటేశ్వర స్వామి ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



పండితుల ఆశీర్వాదం తీసుకుంటున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



ఆలయ నిర్వాహకులు, స్థానికులతో మాజీ మంత్రి



ప్రతిష్ఠాపన శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న సబితా రెడ్డి



ఆలయంలో దర్శనం చేసుకుంటున్న సబితా రెడ్డి

రంగారెడ్డి: ఏప్రిల్ 13( ప్రభాత ఉదయం) మహేశ్వరం నియోజకవర్గం పరిధి లోని కందుకూరు మండలం వేమూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరగింది. ఈ పుణ్య కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబితా రెడ్డి మాట్లాడుతూ.... సనాతన ధర్మానికి ఆలయాలు కేంద్ర బిందువులని, ఈ దేవస్థానం గ్రామ అభివృద్ధి, ఐక్యత, ఆధ్యాత్మిక శక్తిని అందిస్తుందని అన్నారు. భవిష్యత్తులో ఆలయ అభివృద్ధికి స్థానిక ఎమ్మెల్యేగా మా వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని హామీ ఇచ్చారు.అనంతరం గ్రామ ప్రజలతో మమేకమై ఆలయ నిర్మాణానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య జరిగిన ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు ఆలయ నిర్వాహకులు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు మహిళా నాయకురాళ్లు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



చిన్న నాడు తమకు ఆటలు ఆడించిన విద్యా వాలింటర్ భీమయ్య (పీ ఈ టీ) ను సన్మానిస్తున్న 2000 - 2001 లో రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు

# అంగరంగ వైభవంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

## చిన్ననాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్న విద్యార్థులు
## సంతోషం వ్యక్తం చేసిన ఉపాధ్యాయులు

బుద్వేల్, ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం): వారంత చిన్ననాడు కలిసి చదువుకున్న విద్యార్థులు. వేరే వేరే ప్రాంతాలలో వేరే వేరే రంగాలలో స్థిరపడ్డారు. కొందరు బుద్వేల్ లో చదువుకోగా మరికొందరు కిస్మత్ పూర్ లో చదువుకున్నారు. ఉన్నత చదువు కోసం రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చేరారు. 25 సంవత్సరాలకు పూర్వం అంటే 2000 సంవత్సరం 2001లో 10వ తరగతి పూర్తి చేశారు. వారంతా ఒకసారి కలవాలని నిర్ణయం తీసుకున్నారు. ఎవరో ఒకరు ముందుకు రావాలి కదా అలాగే ముందుకు వచ్చారు కొంతమంది పూర్వ విద్యార్థులు వారిలో వినోద్ కన్నా, నరేష్, బాబు, దాసు, నవీన్ , ఫైజల్, కిరణ్ బేబీ, అనురాధ , ఊర్మిళ లతోపాటు మన కొందరు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తమ స్నేహితులందరి చిరునామాలు సేకరించి వారి వివరాలు తెలుసుకొని వారితో సంప్రదింపులు జరిపారు.

### ఆదివారం అంగ రంగ వైభవంగా.....

ఆదివారం బుద్వేల్ లోని ఎస్ఎన్ఆర్ బంకెట్ హాల్ లో అంగరంగ వైభవంగా రాజేంద్ర నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది.



రాంబాగ్‌లో సమావేశం అయిన భక్తులు

# ఈ నెల 29న పరశురాం జయంతి వేడుకలు

బుద్వేల్, ఏప్రిల్ 13 (ప్రభాత ఉదయం): ఈ నెల 29న పరశురాం జయంతి ని నిర్వహిం చనున్నట్లు అత్తాపూర్ కు చెందిన శ్రీ పరశురాం భక్త మండలి నిర్వాహకులు అశోక్ శర్మ, శ్రీకాంత్ శర్మ లు తెలిపారు. ఆదివారం అత్తాపూర్ రాంబాగ్ రామాలయంలో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ సమావేశానికి జయంతి నిర్వాహకులు సుదర్శన్ ప్రసాద్ తివారీ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ, ఈ నెల 29న నిర్వహించనున్న భగవాన్ పరశురాం జయ ంతి కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. శోభా యాత్ర కూడా ఉంటుందన్నారు. కార్యక్రమం లో బాబులాల్ జోషీ, శోభా పాండే, లక్ష్మీకాంత్ గ్యాస్, శశికాంత్ శర్మ, ఓం ప్రకాశ్ శర్మ, మీనాదేవీ, కమల్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# కొలన్ సుధాకర్ రెడ్డికి పితృ వియోగం



కొలన్ మోహన్ రెడ్డి

బుద్వేల్, ఏప్రిల్13(ప్రభాత ఉదయం): హైదర్ గూడ శివానగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొలన్ సుధాకర్ రెడ్డి తండ్రి కొలన్ మోహన్రెడ్డి (86) ఆదివారం మరణించారు. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. కొలన్ మోహన్ రెడ్డి మరణవార్త గురించి తెలుసుకున్న బంధువులు, స్థానికులు, వివిధ పార్టీల నాయకులు శివానగర్ లోని ఆయన నివాసానికి చేరుకుని భౌతిక కాయంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు హైదర్ గూడ స్మశానవాటికలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

### పలువురి సంతాపం

కొలన్ మోహన్ రెడ్డి మరణవార్త గురించి తెలిసిన ప్రభాత ఉదయం మేనేజింగ్ డైరెక్టర్ మేకల దామోదర్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. కొలన్ సుధాకర్ రెడ్డి తో చిన్న నాడు చదువుకున్న స్నేహితులు సైతం సంతాపం ప్రకటించారు. సంతాపం ప్రకటించిన వారిలో అమెరికాలో ఉంటున్న షమీమ్ సుల్తానా, రాజేం ద్రనగర్ సర్కిల్ కు చెందిన అప్పారెడ్డి గూడెం భీమయ్య, కె. విజయ్ కుమార్, చక్రపాణి, వి.రవీం దర్. ఎం.శివకుమార్. పి.మహేశ్వర్, బి వేణు గోపాల్ లు సంతాపం ప్రకటించారు.

# మద్యం సేవించే ప్రాంతంలో ఒకరిపై ఒకరు దాడి, ఓ వ్యక్తికి కత్తిపోట్లు



సయ్యద్ బాబా



కత్తి పోట్లకు గురైన సయ్యద్ బాబా

బుద్వేల్, ఏప్రిల్13(ప్రభాత ఉదయం) : అత్తాపూర్ ఖాజా నగర్ లో నివాసం ఉ ండే సయ్యద్ బాబా (35) పై గుర్తు తెలియని వ్యక్తులు శనివారం రాత్రి కత్తులతో దాడి చేసి గాయపరిచారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి...... శనివారం రాత్రి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ నిర్మాణుష్యమైన ప్రాంతంలో రెండు గ్రూపులు మద్యం సేవిస్తున్నాయి. ఒక గ్రూపులో మద్యం అయిపోగా రెండవ గ్రూపు వద్దకు వెళ్లిన సయ్యద్ బాబా వారి మద్యం తీసుకోవడం తో గొడవ జరిగినట్లు సమాచారం. అడగకుండ మద్యం ఎలా తీసుకుంటావని గొడవపడి బాబా పై కతు " లతో మరో గ్రూపు వారు దాడి చేశారు. ఈ దాడిలో సయ్యద్ బాబా ముఖంపై, కడుపులో మూడు కత్తిపోట్లు జరిగాయి. స్థానికులు అతన్ని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా వారు వైద్యం చేయడానికి నిరాకరించారు. వెంటనే సయ్యద్ బాబా ను ఉస్మానియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ సంఘటన గురించి సోమవారం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఇన్స్ పెక్టర్ నాగేశ్వర్ రావు తెలి పారు



ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య

# ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి ఐదు ఉత్తమ మొక్క జొన్న హైబ్రిడ్ రకాలు విడుదల

బుద్వేల్ ఏప్రిల్ 13(ప్రభాత ఉదయం): ప్రొఫెసర్ జయ శంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఐదు ఉత్తమమైన మొక్క జొన్న హైబ్రిడ్ రకాలను విడుదల చేసిందని వర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) ఆధ్వర్యంలో తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు లో నిర్వహిం చిన అఖిల భారత మొక్క జొన్న పరిశోధన సమన్వయ సమావేశంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల రూపొందించిన ఐదు ఉత్తమమైన మొక్క జొన్న హైబ్రిడ్ రకాలను విడుదల చేయడం జరిగిందన్నారు. దక్కన్ హైబ్రిడ్ మక్కా 144, డీహెచ్ఎం 182, డీహెచ్ఎం 193, డీహెచ్ఎం 206, డీహెచ్ఎం 218లను విడుదల చేయడం జరిగిందన్నారు. ఇవే కాకుండ ఈ విశ్వవిద్యాలయం నుంచి మొత్తం 24 మొక్క జొన్న హైబ్రిడ్ రకాలు విడుదల అయ్యాయన్నారు. అందులో డీహెచ్ఎం 144(తెలంగాణ మక్కా -6) రకంలో అధిక పిండి పదార్థాలు ఉండటం వలన ఇథనాల్ ఉత్పత్తికి బాగా అనుకూలంగా ఉంటుందని తెలిపారు. అదే విదంగా డీహెచ్ఎం 208(తెలంగాణ మక్కా -3) మెట్ట సాగుకు అనుకూలమైనదని, ఎండు తెగులును సమర్థవంతంగా తట్టుకుంటుందని తెలియజేశారు. ప్రస్తుతం రైతాంగానికి అందుబాటులో ఉన్న వివిధ మొక్క జొన్న వంగడాలతో పోల్చితే ధీహచ్ఎం అన్ని విదాలుగా మేలైందని పరిశోదనలో తేలిందన్నారు. ఈ రకాలను రాబోయే కాలంలో రైతాం గా ఉపయోగించుకోవాలన్నారు.

### 16 పంట రకాలకు గుర్తింపు

జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విడుదల చేసిన 16 వివిధ పంటల రకాలకు ఇటీవల కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వ శాఖ లో జరిగిన సమీక్ష సమావేశంలో అధికారిక ప్రకటిత రకాలుగా (నోటిఫైడ్ వెరైటీస్) గుర్తిస్తు ప్రకటన విడుదల చేశారని గుర్తు చేశారు.

# నేడు రక్తదాన శిబిరం

బుద్వేల్, ఏప్రిల్13(ప్రభాత ఉదయం) : ఈ నెల 14న ఉదయం 8:30 గంటల నుంచి కాటేదాన్ టీఎన్జీవోస్ కాలనీ, మణికంఠ హిల్స్ లో గల శ్రీ అయ్యప్ప దేవాలయం ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు శ్రీ అయ్యప్ప సేవా సమితి నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలన్నారు. తలసేమియ వ్యాధితో బాధపడుతున్న వారి కోసం ఈ రక్తదానం చేయడం జరుగుతుందన్నారు.



పూర్వ విద్యార్థుల సమ్మేళనం ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న గాబ్రియేలమ్మ టీచర్



శాంతా టీచర్



మాట్లాడుతున్న సునేత్రి టీచర్

## ఘనంగా రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల

# 2000-2001 బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

బుద్వేల్, ఏప్రిల్13(ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2000 - 2001 వ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం బుద్వేల్ లోని ఎస్ఎన్ఆర్ బంకెట్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో బుద్వేల్, కిస్మత్పూర్ పాఠశాలలతో పాటు రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయినీ, ఉ పాధ్యాయులను పిలిచి సన్మానించారు. 20 మంది వరకు ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఈ ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్నారు. పూర్వ విద్యార్థుల తరపున వినోద్ కన్నా, నరేశ్, దాసు, నవీన్, ఫైజల్, కిరణ్ బేబీ, అనురాధ, ఉర్మిల, లు ముందుండి నడిపించారు. చిన్న నాడు తాము చదువుకున్న రోజులలో చేసిన చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. ఉపాధ్యాయినీ, ఉ పాధ్యాయులు తమ పట్ల చూపిన ప్రేమ అభిమానాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయ లు అనంతరెడ్డి, గాబ్రియేలమ్మ, శాంత, యాదయ్య, అనంతప్ప, వరలక్ష్మీ, ఉమ, సునేత్రీ, అం జలీదేవీ, నీరజ, ఉత్తర, ఉమారాణి, లలిత, హేమలత, వాణి, ఎబీమయ్య, రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల కు చెందిన వెంకటనారాయణ రెడ్డి లను ఘనంగా సన్మానించారు.

### తల్లిదండ్రులను బాగా చూసుకోవాలి అని సూచించిన ఉపాధ్యాయులు :

25 సంవత్సరాలకు పూర్వం తమ వద్ద చదువుకున్న విద్యార్థులు తమను పిలిచి సన్మానించడం సంతోషకరమన్నారు . మీ పిల్లలను బాగా చదివించండి అని సూచించారు. అదే సమయంలో మీ కన్న తల్లిదండ్రులను బాగా చూసుకోవాలని హితవు పలికారు. విద్యార్థులం దరికి భగవంతుడు ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలు, సుఖ సంతోషాలు ప్రసాదించాలని ప్రార్థించారు.



అనంత రెడ్డి సార్ కు సన్మానం



యాదయ్య సార్ కు సన్మానం



ఉపాధ్యాయులతో నిర్వాహకులు




వినాయకుని పాటపై స్వాగత నృత్యం చేస్తున్న చిన్నారి



## అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి

# 18న విడుదలకి సిద్ధం

ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో నందమూరి కళ్యాణ్ రామ్ నటిస్తున్న 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' చిత్రం ఏప్రిల్ 18న విడుదలకి సిద్ధంగా ఉంది. సాయి మంజ్రేకర్ మహిళా ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ భారీ అంచనాల సినిమాలో విజయశాంతి ఆఫీసర్‌గా కమాండింగ్ పాత్రలో నటిస్తున్నారు. తీవ్రమైన మరియు యాక్షన్-ప్యాక్డ్ టీజర్‌తో అంచనాలను పెంచిన తరువాత మేకర్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను ఆవిష్కరించారు. ట్రైలర్ ఒక పంచ్ ని ప్యాక్ చేసి అంచనాలను తదుపరి స్థాయికి తీసుకువెళ్ళింది. ఈ చిత్రం విడుదలకు ముందు భారీ ప్రోత్సాహాన్ని ఇచ్చింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సోహైల్ ఖాన్ శక్తివంతమైన విరోధిగా నటిస్తుండగా, శ్రీకాంత్, పృథ్వీ రాజ్ కీలక పాత్రలలో నటిస్తున్నారు. సినిమాటోగ్రాఫర్ రామ్ ప్రసాద్, మ్యూజిక్ కంపోజర్ అజనీష్ లోక్‌నాథ్, ఎడిటర్ తమ్మిరాజు మరియు స్క్రీన్ ప్లే రైటర్ శ్రీకాంత్ విస్సాతో సహా అద్భుతమైన సాంకేతిక బృందం ఉంది. అజనీష్ లోక్‌నాథ్ ఈ సినిమాకి సంగీతం సమకూర్చారు. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో అశోక్ క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ చిత్రాన్ని నిర్మించారు.



# మనోజ్‌ను చూసి కన్నీళ్లు పెట్టుకున్న మంచు లక్ష్మి

మంచు వారసురాలు మంచు లక్ష్మీ సడన్గా స్టేజ్ పైనే కన్నీళ్లు పెట్టుకున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ముఖ్యంగా తన తమ్ముడు మంచు మనోజ్‌ను చూసిన వెంటనే ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ప్రస్తుతం అందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. అసలు విషయంలోకి వెళ్తే.. నిన్న మాదాపూర్ లోని హెచ్ఐసీసీలో మంచు లక్ష్మి ఒక ఫ్యాషన్ షో కండక్ట్ చేశారు. ఈ కార్యక్రమానికి ఆమె హోస్ట్గా కూడా వ్యవహరించారు. ఈ ఫ్యాషన్ షో కి హోస్ట్ గా వ్యవహరిస్తున్న సమయంలో.. మంచు మనోజ్ దంపతులు తన అక్కను కలుసుకునే ప్రయత్నం చేశారు. అందులో భాగంగానే వెనుక నుంచి తన అక్క మంచు లక్ష్మిని పిలువగా.. వెంటనేమంచు లక్ష్మి తమ్ముడు మనోజ్ ను చూసి ఒక్కసారిగా ఎమోషనల్ అయిపోయింది. మనోజ్ తన అక్కను ఓదార్చే ప్రయత్నం చేయగా.. మనోజ్ వెంట వచ్చిన ఆయన భార్య మౌనిక కూడా మంచు లక్ష్మిని ఓదార్చే ప్రయత్నం చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఈ ఎమోషనల్ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.



# అజేయులని అనుకోవద్దు

## వారికి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చిన సమంత

సినిమాలకు దూరంగా ఉన్న సమంత క్రేజ్ ఏమాత్రం చెక్కు చెదరలేదు. చేతిలో సినిమాలు లేకపోయినప్పటికీ నిత్యం వార్తల్లో నిలుస్తుంది. నాగచైత్యన్యతో విడిపోయిన తరువాత చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తుందామె.

విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'ఖుషి' సినిమా తరువాత సమంత ప్రేక్షకుల ముందుకు వచ్చింది లేదు. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా యావరేజ్‌గా నిలిచింది.

ఆర్యోగం సహకరించకపోవడంతో సమంత సినిమాల్లో నటించడం ఆపేసింది. ప్రస్తుతం సమంత చేతిలో రెండు సినిమాలు ఉన్నాయి. సినిమాలకు దూరంగా ఉన్న సమంత సోషల్ మీడియాలో యాక్టివ్‌గానే ఉంటుంది. సోషల్ మీడియాలో సమంతకు ఎన్నలేని అభిమానులు ఉన్నారు. సమంతకు సోషల్ మీడియాలో విపరీతమైన ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది.

33 మిలియన్ల అభిమానులు సమంతను సోషల్ మీడియాలో ఫాలో అవుతున్నారంటే అమ్మడు రేంజ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు. సమంత తన సోషల్ మీడియా ద్వారా ఫుడ్‌కు సంబంధించిన ఆరోగ్య చిట్కాలను సైతం అందిస్తుంటుంది. తాజాగా సమంత తన ఫాలోవర్లకు గట్టి వార్నింగ్ ఇచ్చింది. యంగ్ స్టార్స్ అజేయులని అనుకోవద్దని విజ్ఞప్తి చేసింది.

దానికి నేను కూడా అతీతం కాదని సమంత చెప్పుకొచ్చింది. 20 ఏళ్ల వయస్సున్నప్పుడు నా కెరీర్ ప్రారంభించానని, అప్పుడు మన చేతిలో ఎన్ని ప్రాజెక్టులు ఉన్నాయి. ఎన్నో బ్రాండ్స్‌కు ప్రచారకర్తగా వ్యవహరించానని సమంత తెలిపింది. అయితే కొన్ని బ్రాండ్స్ ఎందుకు చేశానా అని ఆత్మ పరిశీలన చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని, సరైన మార్గాన్ని అనుసరించాలని నాకు నేను అనుకున్నాను. అర్థం లేని పనులు చేసినందుకు ఇప్పుడున్న సమంతకు, పాత సమంతకు క్షమాపణ చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందని ఆమె వాపోయింది.

నేను గత ఏడాది 15 బ్రాండ్స్ ను వదలుకున్నా. కోట్ల డబ్బులు కూడా వదులుకున్నా. ఇప్పుడు ఎండార్స్ మెంట్ వచ్చిన ప్రతిసారీ నేను దానిని అంగీకరించే ముందు ముగ్గురు వైద్యులతో ఆ బ్రాండ్స్‌ను చెక్ చేస్తాని అని సమంత తెలిపారు.అందుకే యంగ్ ఏజ్‌లో చేసే పనులు అన్నీ కూడా సరైనవే అనుకోవడం తప్పని తన ఫాలోవర్లకు సమంత హితబోధ చేసింది. ఇక సమంత కెరీర్ విషయానికి వస్తే..విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'ఖుషి' సినిమా తర్వాత సమంత మరో తెలుగు సినిమాలో నటించలేదు.

'సిటాడెల్' అనే బాలీవుడ్ వెబ్ సిరీస్‌లో మాత్రం సమంత నటించారు. అయితే భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ వెబ్ సిరీస్ పెద్దగా ఆకట్టుకోలేక పోయింది. ఇదే సమయంలో సమంత చాలాకాలం తర్వాత తన తెలుగు సినిమాను ఎనౌన్స్ చేశారు.'మా ఇంటి బంగారం' సినిమాతో సమంత తెలుగులో రీఎంట్రీ ఇవ్వబోతుంది.ఈ సినిమాకు సమంతనే నిర్మాతగా కూడా వ్యవహరిస్తున్నారు.సమంత తెలుగులో రీఎంట్రీ ఇవ్వనుండటంతో ఆమె అభిమానులు ఫుల్ ఖుషీ అవుతున్నారు.

# నాని వీరంగం...

## చూస్తే భయపడాల్సిందే



హిట్: ది థర్డ్ కేస్.. ప్రముఖ డైరెక్టర్ శైలేష్ కొలను రచన, దర్శకత్వంలో రాబోతున్న తెలుగు భాషా క్రైమ్ థ్రిల్లర్ మూవీ ఇది.

వాల్ పోస్టర్, యునానిమస్ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో ప్రశాంతి తిపిరినేని, నాని నిర్మిస్తున్నారు. హిట్ యూనివర్స్ లో మూడవ భాగం కావడంతో దీనిపై అంచనాలు భారీగా పెరిగిపోయాయి. హిట్ సీక్వెల్ గా హిట్ : ది సెకండ్ కేస్ 2022లో రాగా.. ఇప్పుడు దానికి సీక్వల్ గా హిట్ 3 రాబోతోంది. ఈ సినిమాలో నాని సరసన శ్రీనిధి శెట్టి నటిస్తూ ఉండగా వీరితోపాటు ఆదిల్ పాలా, బ్రహ్మాజీ, రావు రమేష్, మాగంటి శ్రీనాథ్ తదితరులు నటిస్తున్నారు.

సెన్సార్ పూర్తి చేసుకున్న హిట్ -3

ఇకపోతే హైదరాబాద్, విశాఖపట్నం, జమ్మూకాశ్మీర్ వంటి ప్రాంతాలలో ఈ సినిమా షూటింగ్ జరిగింది. మిక్కీ జే మేయర్ సంగీతాన్ని అందించారు.. మే ఒకటవ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో మునుపెన్నడూ చూడని విధంగా నానిని ఈ సినిమాలో చూడబోతున్నామని ఇటీవల విడుదల చేసిన టీజర్ చూస్తే అర్థమవుతుంది. అత్యంత క్రూరంగా మాస్ పర్ఫామెన్స్ తో నాని అలరించబోతున్నారు. పైకి చూడడానికి క్లాస్ గా కనిపించినా.. ఆయన లోపల ఉండే మాస్ క్రూరత్వం సినిమా చూసేవారికి చెమటలు పట్టడం ఖాయమని నెటిజన్స్ కామెంట్లు చేస్తూ ఉండడం గమనార్హం. ఇకపోతే ఇలా భారీ అంచనాల మధ్య రాబోతున్న ఈ సినిమా తాజాగా సెన్సార్ ను పూర్తి చేసుకుంది.. సెన్సార్ బోర్డు ఇందులో క్రూరత్వం ఎక్కువగా ఉన్న కారణంగా ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. ఇకపోతే ఈ సినిమా 2:35 గంటలు థియేటర్లో ఆడియన్స్ను అలరించబోతోంది. ఇక ఏది ఏమైనా త్వరలో థియేటర్లో నాని వీరంగం చూసి భయపడడానికి సిద్ధం కండి అంటూ అటు మేకర్స్ కూడా పిలుపునిస్తున్నట్లు సమాచారం. మరి ఈ సినిమా ఇలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

## కేరళలో టైగర్ కా హుకుం



"టైగర్ కా హుకుం" అంటూ ముత్తువేల్ పాండియన్‌గా మరోసారి ప్రేక్షకుల్ని అలరించేందుకు 'జైలర్ 2'తో సిద్ధమవుతున్నారు కథానాయకుడు రజనీకాంత్. 'జైలర్'కు సీక్వెల్‌గా నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ బహుభాషా చిత్రాన్ని సన్‌పిక్చర్స్ సంస్థ నిర్మిస్తోంది. రజనీకి భార్యగా రమ్యకృష్ణ నటిస్తున్నారు. మిర్నా మేనన్, ఎస్.జె.సూర్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కేరళలో కొత్త షెడ్యూల్ ప్రారంభించుకుంది. దీనిలో భాగంగా ప్రస్తుతం రజనీ, రమ్యకృష్ణ, మిర్నాలపై కుటుంబ నేపథ్య సన్నివేశాలు తెరకెక్కిస్తున్నారు. ఈ షెడ్యూల్‌తోనే రమ్యకృష్ణ ఈ చిత్ర సెట్లోకి అడుగు పెట్టినట్లు సామాజిక మాధ్యమాల వేదికగా పంచుకుంది. తాను రజనీకి విలన్‌గా నటించిన 'నరసింహ' సినిమా 26ఏళ్ల క్రితం ఏప్రిల్‌లో విడుదలైనట్లు ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. స్టైలిష్ యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ప్రేక్షకుల ముందుకొచ్చే అవకాశమున్నట్లు ప్రచారం వినిపిస్తోంది. ఈ సినిమాకి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608